క్లుప్తంగా

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



నిరవధిక సమ్మెలో పాల్గొన్న వీవోఏలు

కోటపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏలు చేపడుతున్న సమ్మె ఆదివారంతో 14వ రోజుకు చేరింది. కోటపల్లి మండలకేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ.. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, పదోన్నతులు, కనీస వేతనాలు, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సురేష్, కార్యదర్శి రమాదేవి, నిట్టూరి రాజన్న, శుక్రాబి, కోశాధికారి మహేశ్వరి, ఉపాధ్యక్షుడు నాగన్న, సంపత్ పాల్గొన్నారు.

కమిటీ రద్దు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండల మాల మహానాడు కమిటీని రద్దు చేస్తున్నట్లు ఆ సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. గతంలో అద్దంకి దయాకర్ ప్యానల్‌లో కమిటీ పనిచేసేదని, దానికి అధ్యక్షుడిగా గుజ్జ అంకులు ఉన్నారని ఎలాంటి కార్యక్రమాలు చేయకపోవడంతో రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నామని కమిటీ పేర్కొంది. త్వరలోనే బూర్గుల వెంకటేశ్వర్లు ప్యానల్‌లో పని చేయాలని తీర్మానం చేసుకున్నామని, మూడు నాలుగు రోజుల్లో కార్యాచరణ వెల్లడిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



బూర్గుపల్లిలో ప్రారంభిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

భీమారం: మండలంలోని బూర్గుపల్లి, పోలంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ మహేశ్వర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వడ్లకొండ రమాదేవి, దర్శనాల రమేశ్ పాల్గొన్నారు.

అధికారికి సన్మానం



ఏఎస్‌వోను సన్మానిస్తున్న జీఎం, అధికారులు

మందమర్రిరూరల్: ఏరియాలో ఏఎస్‌వోగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన బండారి ఓదెలును ఆదివారం జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏరియా జీఎం మోహన్‌రెడ్డి, అధికారులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. శేషజీవితం సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

అందుబాటులో లేని వైద్య సిబ్బంది



ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

భీమిని: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం సాయంత్రం వైద్య సిబ్బంది ఎవరూ లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడ్డారు. భీమినికి చెందిన కారుకూరి ప్రసాద్‌కు గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రికి వెళ్లగా, సిబ్బంది ఎవరూ లేరు. దీంతో ప్రైవేట్ వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకున్నాడు. వైద్య సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండి వైద్యం అందించాల్సి ఉన్నప్పటికీ, ఎవరూ లేకపోవడంతో రోగులు అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

మందమర్రిరూరల్: అకాల వర్షాలతో రైతుల చేతికొచ్చిన పంటకు నష్టం కలుగుతుందని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌టీపీ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని సారంగపల్లి గ్రామంలోని మైదానంలో ఆదివారం వడ్లు ఆరబోసిన రైతులను కలిసి, వారి కష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్‌టీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజీమొద్దీన్ మాట్లాడుతూ.. రైతుబంధు సాయం కింద కేసీఆర్ ప్రభుత్వం అందించే రూ.5వేలు రైతులకు సరిపోవడం లేదని, రూ.30వేలు అందించాలని, కొనుకోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు రాజేంద్రప్రసాద్, ప్రభుదేవ్, సంతోష్, సాయికిశోర్, జావీద్ పాష తదితరులు ఉన్నారు.



దండేపల్లి: మేదరిపేటలో కుంకుమపూజలో మహిళలు



నెన్నెల: కుంకుమార్చనలో ఆర్యవైశ్య మహిళలు

ఘనంగా వాసవీ కన్యాకాపరమేశ్వరి జయంతి



జన్నారం: కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

జన్నారం: వాసవీ మాత జయంతిని స్థానిక భక్తాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు నరహరిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొని పూజలు చేశారు. కుంకుమ పూజలతో పాటు వాసవీమాతకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జక్కు సత్తయ్య, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు జక్కు భూమేష్, వర్తక సంఘం అధ్యక్షుడు బండారు మారుతిరాజ్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

నెన్నెల: స్థానిక గంగాధర దేవాలయంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు ఆర్యవైశ్య సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకం, కన్యపూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ముందుగా గణేషపూజ, దుర్గాహోమం, 108నామాల అర్చన, మహమంగళ హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు డి.రాజన్న, చిరువేరు రమేష్, కాచం పురుషోత్తం, సత్యనారాయణ, నరేంద్రుల శ్రీనివాస్, మురళి, ఆంజనేయులు, భీమయ్య పాల్గొన్నారు.



భీమారం: కుంకమపూజలో పాల్గొన్న మహిళలు

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట. మేదరిపేట గ్రామాల్లో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి మాత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుంకుమపూజలు, హనుమాన్ చాలీసా, లలిత, వాసవీ పారాయణాలు చదివారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణతో పాటు, అన్నదానం చేశారు.

భీమారం: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కన్యకా పరమేశ్వరీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



జిల్లా కేంద్రంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు



ఆరాధనలో పాల్గొన్న భక్తులు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

మంచిర్యాలఅర్బన్: స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి స్వాముల వారి ఆరాధనోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. విశ్వబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు రాంప్రకాశ్, గౌరవ అధ్యక్షుడు రాజన్న, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి సురేందర్, పట్టణ కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు, వెల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్, జిల్లా స్వర్ణకార అధ్యక్షుడు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని రెండో జోన్ రైల్వే స్టేషన్ రోడ్డులో గల శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహ్మాచారి, కస్తూరి స్వప్న–శ్రీకాంత్, మీనా–శ్రీనాథ్, ఆలయ అర్చకులు కుశకుమార్, ముత్తోజు రాజు, కట్కోజ్వల వేణు, రాజయ్య, బ్రహ్మాచారి, శ్రీనివాస్, మల్లాచారి తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా సహస్ర ఘటాభిషేకం

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మూల విరాట్ విగ్రహానికి సహస్ర ఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, హోమములు వేదబ్రాహ్మణులు, అర్చకులతో జరిపారు. అనంతరం పట్టణ పురవీధుల్లో అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. మహిళల కోలాటా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో ముక్తారవి పలువురు పాల్గొన్నారు.



హోమం నిర్వహణలో అర్చకులు

నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం..!

- మండలంలో 17 గ్రామపంచాయతీలకు కొత్త భవనాలు
- ఒక్కో జీపీ భవనానికి రూ.20లక్షలు మంజూరు

దండేపల్లి: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంగా తయారైంది మండలంలోని పలు గ్రామాల్లో కొత్త పంచాయతీ భవనాల నిర్మాణాల దుస్థితి. చినుకుపడితే చాలు లీకేజీలతో తడిసిపోయే శిథిలభవనాలు, అరకొర వసతులతో పల్లెపాలకులు పడుతున్న ఇబ్బందులు తొలగించడం కోసం, ప్రభుత్వం కొత్త భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. పాత పంచాయతీల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలతో పాటు, కొత్తగా ఏర్పాటైన పంచాయతీలకు కూడా, నూతన పంచాయతీ భవనాలు నిర్మించనున్నారు. దండేపల్లి మండలంలోని 17గ్రామ పంచాయతీలకు, కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20లక్షల చొప్పున ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరు చేసి నెలలు గడుస్తున్నా, పనులు ప్రారంభించకపోవడంతో కొత్త భవనాల నిర్మాణం పనులు ఇంకెప్పుడు ప్రారంభిస్తారో అని పలువురు ఎదురు చూస్తున్నారు.



శిథిలావస్థలో ముత్యంపేట పంచాయతీ కార్యాలయం

త్వరలో పనులు ప్రారంభిస్తాం..

నూతన పంచాయతీ భవనాల నిర్మాణం పనులు త్వరలో ప్రారంభిస్తాం. మొన్నటి వరకు సీసీ రోడ్ల నిర్మాణం పనులు జరగడంతో, పంచాయతీ భవనాల నిర్మాణంలో కొంత ఆలస్యం జరిగింది. వీలైనంత త్వరలో పనులు ప్రారంభిస్తాం. – హరీష్, పీఆర్, డీఈ

17 గ్రామాల్లో కొత్త పంచాయతీ భవనాలు..

మండలంలోని నెల్కివెంకటాపూర్, రెబ్బనపల్లి, దండేపల్లి, నర్సాపూర్, లింగాపూర్, నాగసముద్రం, తాళ్లపేట, గుడిరేవు, పెద్దపేట, లక్ష్మీకాంతపూర్, కాసిపేట, చింతపల్లి గ్రామాలతో పాటు కొత్తగా ఏర్పాటైన కర్ణపేట, మాకులపేట, ముత్యంపేట, తానిమడుగు, చెల్కగూడెం గ్రామాల్లో కొత్త పంచాయతీ భవనాలు నిర్మించనున్నారు.

క్రీడా స్థలం ధ్వంసం

వేమనపల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామ శివారులో యువకులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసుకున్న క్రీడా స్థలాన్ని అటవీశాఖ అధికారులు ధ్వంసం చేశారు. 20 ఏళ్లుగా స్థలంలో గ్రామస్తుల అవసరాల కోసం పశువులు నిలిపే స్థలం (బంజరు దొడ్డి)కి ఉపయోగిస్తున్నారు. ఆ స్థలంలోనే గ్రామానికి చెందిన యువకులు వాలీబాల్, కబడ్డీ కోర్టులను ఏర్పాటు చేశారు. అటవీ సిబ్బంది వాలీబాల్ కోర్టుకు చెందిన కర్రలను నరికి నెట్‌ను ధ్వంసం చేశారు. ఆడుకునే స్థలాన్ని ధ్వంసం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై వేమనపల్లి అటవీ సెక్షన్ అధికారి రాజేష్‌ను వివరణ కోరగా అటవీ భూమిలో వాలీబాల్, క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అక్కడి నుంచి మార్చాలని చెప్పిన పట్టించుకోకపోవడంతో కర్రలు, నెట్‌ను తొలగించామన్నారు.



వాలీబాల్ కోర్టు కర్రలు నరికేసిన దృశ్యం

'మన్‌కీబాత్' వీక్షించిన బీజేపీ నాయకులు

శ్రీరాంపూర్: ప్రజలతో నేరుగా మాట్లాడే ప్రధానమంత్రి కార్యక్రమం అయిన మన్‌కీ బాత్‌ను ఆదివారం శ్రీరాంపూర్‌లో బీజేపీ నేతలు, స్థానికులతో కలిసి వీక్షించారు. కృష్ణాకాలనీలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సత్రం రమేశ్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి మొగిలి పాల్గొన్నారు. వందో ఎపిసోడ్ సందర్భంగా నేతలు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. ప్రధానమంత్రి ఉపన్యాసాన్ని ఈ సందర్భంగా శ్రద్ధగా వీక్షించారు. కార్యక్రమంలో నాయకులు కొంతం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

2న ఆర్మీ ఫ్రీ మెడికల్ క్యాంపు

తాండూర్: కరీంనగర్‌లో ద్రోణాచార్య డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 2వ తేదీన ఆర్మీ ఫ్రీ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ తెలిపారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, కేంద్ర పారా మిలటరీ బలగాలైన సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, బీ ఎస్ఎఫ్ వంటి ఉద్యోగాల్లో చేరాలనుకునే యువతకు ఉచిత ఫ్రీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువకుల కోసం 2వ తేదీన గోలేటి టౌన్‌షిప్ నుంచి ప్రత్యేకంగా కరీంనగర్ వెళ్లేందుకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్‌నం.8919158374 సంప్రదించాలని తెలిపారు.



పల్లె వీధుల్లో ఉల్లి రైతు..!

ఉల్లి రైతుకు కష్టాలు వెంటాడుతున్నాయి.. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో నష్టాలు తప్పవేమోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి క్వింటాల్‌కు రూ.800 నుంచి రూ.1000కూడా రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. దీంతో నష్టాల నుంచి తప్పించుకోవడానికి ఉల్లిగడ్డలను ఎడ్లబండ్లు, బొలేరో, ఆటో ట్రాలీల్లో పల్లెల్లోకి తీసుకొచ్చి వీధుల్లో తిరుగుతూ రూ.1500క్వింటాల్ చొప్పున విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. – నెన్నెల

వేమనపల్లికి అదనపు బస్సులు



కల్లెంపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు

వేమనపల్లి: మండల కేంద్రంతో పాటు కళ్లెంపల్లికి మంచిర్యాల డిపో నుంచి చెన్నూర్ మీదుగా మూడు అదనపు బస్సు ట్రిప్పులు ఆదివారం ప్రారంభమయ్యాయి. చెన్నూర్ నుంచి ఉదయం 8.30గంటలకు, 11.30, నైట్‌హాల్ట్ 8.30ప్రాంతంలో బస్సులు నడిచేవి. మండల ప్రజల కోరిక మేరకు అదనంగా మధ్యాహ్నం 1గంట, 2.30గంటలకు, 4.30గంటలకు అదనంగా బస్సు ట్రిప్పులు ప్రారంభమయ్యాయి. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ కోరారు.

'మేడే'ను జయప్రదం చేయండి

జన్నారం: మేడే వేడుకలను కార్మికులు జయప్రదం చేయాలని, పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా గౌరవ అధ్యక్షుడు రంజిత్ పిలుపునిచ్చారు. మండలంలోని పొనకల్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం పంచాయతీ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. కార్మికుల సమస్యలపై మాట్లాడారు. కార్మికులకు 8గంటల పనివిధానం అమలులో ఉండాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అమరులైన కార్మికుల త్యాగాలతో ఏర్పడ్డ మేడే వేడుకలను కార్మికులు విజయవంతం చేయాలన్నారు. అనంతరం 23మందితో నూతన మండల కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అశోక్, బుచ్చన్న ప్రజా సంఘాల నాయకులు, పంచాయతీ వర్కర్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంజిత్

ప్రేమ్‌సాగరన్న అంబలి పంపిణీ ప్రారంభం

మంచిర్యాలక్రైం/నస్పూర్: వేసవి తాపాన్ని తీర్చేందుకు కొక్కిరాల రఘుపతిరావ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రేమ్‌సాగరన్న అంబలి కేంద్రాలను ప్రారంభించారు. జిల్లాలో మంచిర్యాల ఐబీ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, సీసీసీ కార్నర్, శ్రీరాంపూర్ బస్టాండ్ సమీపంలో అంబలి కేంద్రాలను ప్రారంభించారు. రాజకీయాలకతీతంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి, కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నాయకులు, నరేష్, ప్రభాకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావ్

వాహనాల తనిఖీ

నెన్నెల: మండల కేంద్రంలోని టీ రోడ్డు వద్ద ఆదివారం నెన్నెల ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. పెండింగ్ చలాన్‌లు వసూలు చేశారు. ప్రతి ఒక్కరి వద్ద ధ్రువ పత్రాలు ఉండాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో మహకవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) జయంతిని ఆదివారం నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళావేదిక అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, కవులు, రచయితలు రాజిరెడ్డి, వామన్‌రావు, రాజేశం, భరత్, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

రోడ్డుపై వరదనీరు..!

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి మూసివేతకు గురైన రామాటాకీసుకు వెళ్లే మార్గంలో యూనియన్ బ్యాంకు ఎదుట చిరుజల్లులకే రోడ్డుపై వరద నీరు నిలుస్తోంది. రోడ్డుపై నీరునిలిచి వాహనదారులు, పాదాచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా మురికినీటి కాలువలు నిర్మించి, రోడ్డుపై నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : కె.సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్
ఫోన్ నంబర్ : 98499 05887



సిబ్బంది లేక ఇబ్బంది..!

- తహసీల్దార్ కార్యాలయం పనుల్లో జాప్యం
- అవస్థలు పడుతున్న ప్రజలు

మందమర్రిరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం పరిధిలో రామకృష్ణాపూర్, మందమర్రి మున్సిపాల్టీలతో పాటు పది గ్రామపంచాయతీలు ఉండగా, ఆ కార్యాలయంలో పూర్తి స్థాయిలో సిబ్బంది లేక అందుబాటులో ఉన్న సిబ్బందిపైనే పనిభారం పడుతోంది. కార్యాలయంలో ముగ్గురు అటెండర్స్ ఉండాల్సి ఉండగా, ఒక్కరు కూడా లేకపోవడంతో అధికారులే ఆ పనులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నాయబ్ తహసీల్దార్ రెండు నెలల క్రితం లాంగ్ లీవ్ పెట్టి వెళ్లగా, ఆఫీస్‌లో మరో ముఖ్యమైన అధికారులు ఏఎస్‌వో ఇన్‌చార్జిగా ఉండడం, సర్వేయర్ కూడా రెవెన్యూ శాఖకు సంబంధించిన వారు కాకుండా, ఐకేపీ విభాగానికి చెందిన వారు కావడంతో మండలంలోని పలు భూ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ముఖ్యమైన సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.



మందమర్రి తహసీల్దార్ కార్యాలయం

పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు

మండలంలో రామకృష్ణాపూర్, మందమర్రి రెండు మున్సిపాలిటీలు, పది గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో మందమర్రి మున్సిపాలిటీలో 1/70 చట్టం అమల్లో ఉంది. భూ సమస్యలు, రోడ్డు విస్తరణ పనులు, కోర్టు కేసులు, స.హ చట్టం దరఖాస్తులు, ధ్రువ పత్రాల పరిశీలన, కార్యాలయ నిర్వహణ బాధ్యత తదితర పనులు నాయబ్ తహసీల్దార్‌తో పాటు పూర్తి స్థాయిలో సిబ్బంది లేక కొంత జాప్యం జరుగుతోంది. కావాల్సిన సిబ్బందిని నియమిస్తే పనుల్లో జాప్యం ఉండదు. – సంపతి శ్రీనివాస్, తహసీల్దార్, మందమర్రి